

### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



### భావదేవునికి చక్రస్నానం

బాపట్ల: శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీరభావనారాయణస్వామి 1431వ నవాహ్నిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం చక్రస్నానం నిర్వహించారు.



### కంచి పరమాచార్య జయంతి

నగరంపాలెం: గుంటూరు బృందావన్‌గార్డెన్స్ లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి జయంతి శుక్రవారం నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### గుంటూరు, పల్నాడు జిల్లాలకు ప్రత్యేక పోలీసు అధికారులు

- గుంటూరు జిల్లాకు ముగ్గురు, పల్నాడు జిల్లాకు ఎనిమిది మంది
- నేడు బాధ్యతలు స్వీకరించనున్న అధికారులు

నరసరావుపేట: ఎన్నికల విధుల్లో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాలకు రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులను ప్రత్యేకంగా నియమిస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గుంటూరు జిల్లాకు ముగ్గురు, పల్నాడు జిల్లాకు ఎనిమిది మంది అధికారులు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. నియమితులైన వారిలో గుంటూరు జిల్లాకు తూర్పుగోదావరి ఎస్ఈబీ అదనపు ఎస్పీ సి.జయరాజు, సీఐడీ డీఎస్పీలు కె.వేణుగోపాల్, బి.లక్ష్మీనారాయణలు ఉన్నారు. పల్నాడు జిల్లాకు తూర్పు గోదావరి ఎస్ఈబీ అదనపు ఎస్పీ పి.సోమశేఖరరావు, సీఐడీ అదనపు ఎస్పీలు సీహెచ్. పాపారావు, వి.గోపాలకృష్ణ, రాజశేఖరరావు, డి.లక్ష్మణరావు, ఏ.లక్ష్మీనారాయణ, మెరైన్ అదనపు ఎస్పీ జీబీఆర్ మధుసూదనరావు, ఏపీపీఏ అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి నియమితులయ్యారు.

### సజావుగా ఆన్‌లైన్ డీసెట్

గుంటూరు ఎడ్యుకేషన్ : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (డీసెట్) ఆన్‌లైన్‌లో శుక్రవారం సజావుగా జరిగింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ నల్లపాడులో ఏర్పాటు చేసిన రెండు ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో రెండు రోజుల పాటు జరగనున్న డీసెట్‌లో భాగంగా మొదటి రోజున కేటాయించిన 384 మంది అభ్యర్థులకు 330 మంది హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష సజావుగా నిర్వహించినట్లు డీఈవో పి.శైలజ తెలిపారు.

### మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

ఏపీ ఎస్పీ రేంజ్ డీఐజీ రాజకుమారి



తాడేపల్లిరూరల్ : చిన్నారులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ ఎస్పీ రేంజ్ డీఐజీ రాజకుమారి అన్నారు. శుక్రవారం చినకాకాని షైన్ ఆనంద శరణాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడా చదువుకునే అవకాశాలు లేనప్పుడు కొంతమంది ఆయనకు సహకరించారని, ఆయన భారత రాజ్యాంగ నిర్మాతగా దేశానికి దిక్సూచి అయ్యారని చిన్నారులకు వివరించారు. చిన్నారులు అలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని అన్నారు. అనంతరం కుమార్తె దాసరి చెన్నసుమ జన్మదినోత్సవం సందర్భంగా చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, శరణాలయం నిర్వాహకురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా జనన, మరణ రిజిస్ట్రార్‌గా డీఎంహెచ్‌ఓ

గుంటూరుమెడికల్: జనన, మరణ ధృవీకరణ పత్రాలు జారీచేసే జిల్లా రిజిస్ట్రార్ బాధ్యతలు డీఎంహెచ్‌ఓకు అప్పగిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆసుపత్రుల్లో పుట్టిన పసికందులకు 30 రోజుల్లోపు మెడికల్ ఆఫీసర్లు సర్టిఫికెట్లు అందజేస్తారు. 30 రోజులుదాటి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే తహసీల్దారు వాటిని పరిశీలించి మంజూరు చేస్తారు. ఇక నుంచి తహసీల్దారు వద్దకు వెళ్లే పనిలేకుండా 30 రోజులు గడువు దాటిన బర్త్, డెత్ సర్టిఫికెట్లు జిల్లా రిజిస్ట్రార్‌గా డీఎంహెచ్‌ఓ మంజూరు చేసేలా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

### నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీరాధిక తొలగింపు

గుంటూరుమెడికల్: గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీరాధికను తొలగిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింగ్ స్కూల్‌లో సీనియర్ ఫ్యాకల్టీగా ఉన్న సుజాతను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. లక్ష్మీరాధిక నర్సింగ్ విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్, పుస్తకాల కోసం రూ.8 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆరోపణలపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఆమెకు ఈనెల 22న చార్జి మెమో ఇచ్చారు. తాజాగా ఆమెను ప్రిన్సిపాల్ బాధ్యతల నుంచి తొలగిస్తూ సూపరింటెండెంట్ ఉత్తర్వులు ఇచ్చారు.

# ఖరీఫ్‌కు సన్నాహం

- వరుణుడి పలకరింపు
- రుతుపవనాలు సకాలంలో రానున్నట్లు సంకేతాలు
- సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు
- ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీపై అందజేసేందుకు ఏర్పాట్లు
- జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 1.26 లక్షల హెక్టార్లు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

కొరిటిపాడు(గుంటూరు): కొద్ది నెలలుగా దాదాపు 42 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతతో నిప్పుల గుండంలా మారిన వాతావరణం గత వారం రోజులుగా కాస్త చల్లబడింది. వరుణుడి కరుణతో జిల్లా వ్యాప్తంగా అడపాదడపా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రబీ సీజన్‌లో సాగుచేసిన పంటల కోతలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇటువంటి సానుకూల పరిస్థితుల్లో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. కాడి పట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పొలాలను సిద్ధం చేసుకునే పనిలో తలమునకలవుతున్నారు. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ ఖరీఫ్ సాగు ప్రణాళికలు రూపొందించింది. సాగుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకే) ద్వారా 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నారు.

**1,25,914 హెక్టార్లలో సాగు**

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 1,25,914 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనాలు రూపొందించింది. అత్యధికంగా వరి 63,733 హెక్టార్లు, పత్తి 26,982 హెక్టార్లు, మిరప 20,625 హెక్టార్లు, మినుము 2,417 హెక్టార్లు, కూరగాయల పంటలు 2,198 హెక్టార్లలో సాగు జరుగుతుందని అంచనా వేశారు.

**50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు**

ఖరీఫ్ సాగులో భూసారాన్ని పెంపొందించడంలో పచ్చి రొట్ట విత్తనాలు కీలక భూమిక పోషిస్తాయి. పశువుల ఎరువులకు ప్రత్యామ్నాయంగా వినియోగించే ఈ విత్తనాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తోంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అవసరమైన విత్తనాలను వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచింది. 324 క్వింటాళ్ల జీలుగ, 473.42 క్వింటాళ్ల జనుము, 1105.30 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలను ముందస్తుగానే అందుబాటులో ఉంచింది. జీలుగ, జనుము విత్తనాల కిలో ధర రూ.88 కాగా రూ.44లకు, పిల్లిపెసర కిలో ధర రూ.134 ఉండగా, రాయితీపై కేవలం రూ.67లకే అందజేస్తున్నారు.

**విత్తనాలు సిద్ధం**

ఖరీఫ్‌లో రైతులు అత్యధికంగా వరి, పత్తి, మిరప పంటలు సాగు చేపడతారు. వారికి అవసరమైన అన్ని రకాల విత్తనాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. వరి విత్తనాలు 40 వేల క్వింటాళ్లు అవసరమవుతాయని అంచనా వేసి ఇప్పటికే 25 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. పత్తి విత్తనాలు 1.35 లక్షల ప్యాకెట్లు, మిరప విత్తనాలు 5.16 లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయని అంచనా వేసి ఇప్పటికే విత్తన కంపెనీల డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వరికి సంబంధించి ఎకరానికి నాలుగైదు సెంట్ల విస్తీర్ణంలో మాత్రమే నారుమడులు వేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఎకరానికి 25 కిలోల విత్తనాలు సరిపోతాయి. విత్తన శుద్ధి చేసిన వాటిని మాత్రమే సాగుకు ఉపయోగించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**60,083 మెట్రిక్ టన్నుల ఎరువుల ఆవశ్యకత**

ఖరీఫ్‌లో ఆశించిన మేర దిగుబడులు రావాలంటే నాణ్యమైన ఎరువుల ఆవశ్యకత ఎంతైనా ఉంది. నకిలీల బారిన పడి రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచింది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 60,083 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 22,500 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. రైతులు తమకు అవసరమైన ఎరువులను ఆర్‌బీకేలు, సొసైటీలు, డీలర్ల వద్ద పొందవచ్చు. సాధ్యమైనంత వరకూ సేంద్రియ ఎరువులనే వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

#### ఖరీఫ్‌కు సిద్ధంగా ఉన్నాం..



ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నాం. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట, వరి, పత్తి, మిరప విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నాం. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు ఆర్‌బీకేల ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది రుతుపవనాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంది. పంట సాగు లాభదాయకంగా మారనుంది. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. సాగుపై రైతులకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం.

– నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి.

## ప్రశాంత వాతావరణంలో కౌంటింగే లక్ష్యం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్
- ఆర్వోలు బుక్‌లోని నిబంధనలు విధిగా పాటించాలి
- రిసెప్షన్ సెంటరు వద్ద నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి.లత్కర్, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: జూన్ నాల్గవ తేదీన ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడమే అందరి లక్ష్యం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయములోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులతో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు, జాగ్రత్తలు చెప్పారు. నియోజకవర్గ ఆర్వోలు కౌంటింగ్ సెంటర్‌లోని స్ట్రాంగ్ రూములకు ఒకటి, రెండు రోజుల్లో పోస్టల్ బ్యాలెట్‌లను తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్ ముందు అర కిలోమీటర్ పరిధిలో వాహనాలకు అనుమతిలేదని అన్నారు. నియోజకవర్గాల వారీగా ఏడు ముఖ ద్వారాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈ నెల 27వ తేదీన చేపట్టడం జరుగుతుందన్నారు. రెండోది ఎన్నికల పరిశీలకుల సమక్షంలో జూన్ మూడో తేదీన, మూడోది జూన్ నాల్గున ఉదయం ఐదు గంటలకు నిర్వహిస్తామన్నారు. ఆర్వోలు స్ట్రాంగ్ రూము నుంచి క్యూలైన్ పద్ధతిలో కౌంటింగ్ హాలుకు ఈవీఎంల తరలింపునకు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, వారికి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ఉండేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియను వీడియో తీయాలన్నారు. సిబ్బందిని గుర్తించేందుకు వివిధ రంగుల టీ-షర్టులు అందజేస్తామన్నారు. ఈనెల 31 తర్వాత కౌంటింగ్ ఏజంట్ల వివరాలు అనుమతించబడవని అన్నారు. రౌండ్ వైజ్ సమాచారాన్ని మీడియా సెంటర్‌కు ఎప్పటికప్పుడు అందించేలా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు.

రిసెప్షన్ సెంటరు వద్ద నిబంధనలు అతిక్రమించిన సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ టేబుల్ వద్ద అభ్యర్థులు అందరు సమానమే అని ఎన్నికల పరిశీలకులకు కేటాయించిన సీట్లలో ఎవ్వరినీ అనుమతించవద్దని సూచించారు. నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని, ఏమైనా అవకతవకలు జరిగితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బంది మొబైల్ ఫోనులను సెంటర్‌లోకి అనుమతించకుండా వాటిని నియోజకవర్గాల వారీగా ప్రత్యేకంగా భద్రపర్చటం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వివరాలు ఎన్ కోర్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## నిప్పుల కొలిమిగా రెంటచింతల

గరిష్ట ఉష్ణోగ్రత 43.6 డిగ్రీలు నమోదు



నిర్మానుష్యంగా ఉన్న మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారి

రెంటచింతల: రెంటచింతలలో శుక్రవారం గ్రామంలో గరిష్ట ఉష్ణోగ్రత 43.6, కనిష్ట ఉష్ణోగ్రత 30.1 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా 10 రోజులపాటు 36 నుంచి 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదుకావడంతో ఎండల తీవ్రత తక్కువగా ఉంది. ప్రస్తుతం రోహిణి కార్తె కూడా ప్రారంభం కావడంతో మరోసారి ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో గ్రామస్తులు అల్లాడిపోయారు. ఒక్కసారిగా రెంటచింతల గ్రామం నిప్పుల కొలిమిగా మారడంతోపాటు వెచ్చని గాలులు వీస్తుండటంతో గ్రామస్తులు ఆరుబయటకు వస్తే ఎక్కడ వడదెబ్బ తగులుతుందోనని ఆందోళనకు గురౌతున్నారు. దీంతో గ్రామంలోని మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారితోపాటు వీధులన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయాయి. తీవ్రమైన ఎండలు, ఉక్కపోత కారణంగా వృద్ధులు, చిన్న బిడ్డలు, బాలింతలు, గర్భిణులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనులకు వెళ్లిన కూలీలు ఎండలకు బయపడి ఉదయం 11 గంటలకే ఇంటి బాట పడుతున్నారు. మండుతున్న ఎండల కారణంతో గ్రామస్తులు కొబ్బరి బొండాలు, శీతలపానియాలతో ఉపశమనం పొందుతున్నారు.

## ఆవిరైన ఆశల దీపం

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి
- ఎస్ఎల్ గుడిపాడులో విషాదచాయలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జగదీష్

బల్లికురవ: మొక్కజొన్నలు కొనుగోలు చేసి ట్రాక్టర్‌కు లోడ్ చేసుకుని వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఓ విద్యార్థి అక్కడికక్కడే చనిపోగా ట్రాక్టర్ డ్రైవర్ గాయాల పాలయ్యాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి నార్కెట్‌పల్లి- మేదరమెట్ల నామ్ రహదారిలోని అద్దంకి మండలం శ్రీనివాసనగర్ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. బల్లికురవ మండలం ఎస్ఎల్ గ్రామానికి చెందిన కల్లూరి పెద్దబ్బాయి, కోటేశ్వరమ్మ, దంపతులకు కుమారుడు జగదీష్(14) కుమార్తె లక్ష్మీప్రియ ఉన్నారు. పంగులూరు మండలం ముప్పవరంలోని పెద్దబ్బాయి.. అక్క నరసమ్మకు గ్రామంలో 30 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు కొనుగోలుచేసి గురువారం రాత్రి ట్రాక్టర్ లోడ్ చేసుకుని శింగరకొండ మీదుగా ముప్పవరం బయలుదేరారు. డ్రైవర్ రావులపల్లి రవి పక్కనే ట్రాక్టర్‌పై జగదీష్ కూర్చున్నాడు. ఇంతలోనే లారీ ఢీకొట్టడంతో జగదీష్ అక్కడికక్కడే చనిపోగా రవి గాయపడ్డాడు. స్థానికులు అద్దంకి 108కి సమాచారం ఇవ్వటంతో రవిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

**విలపిస్తున్న కుటుంబ సభ్యులు**

పెద్దబ్బాయికి పదేళ్ల కిందట రెండు కాళ్లు చచ్చుపడిపోగా ఏపని చేయలేదు. కొద్దిపాటి పొలం ఉంది. తమ కష్టాలు పిల్లలకు రాకూడదని తల్లి కోటేశ్వరమ్మ పొలం పనితోపాటు గేదెలను మేపుకుంటూ బిడ్డలను చదివిస్తోంది. కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవటంతో తల్లిదండ్రులు, అక్క, బంధువులు విలపిస్తున్నారు. పోస్టుమార్టం తదుపరి శుక్రవారం సాయంత్రంఅంత్యక్రియలు జరిపారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి, ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేసిన 23 పరీక్ష కేంద్రాలలో 1289 మంది విద్యార్థులు తొలిరోజు తెలుగు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 560మంది హాజరయ్యారు. మరో 729 మంది గైర్హాజరైనట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 26 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొదటిరోజు జరిగిన జూనియర్ ఇంటర్మీడియేట్ లాంగ్వేజ్ పరీక్షకు జనరల్ విద్యార్థులు 2,476 మందికిగాను 2,263 మంది హాజరయ్యారు. మరో 213మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 140 మందికిగాను 131మంది హాజరు కాగా, మరో తొమ్మిది మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి తెలిపారు. సీనియర్ ఇంటర్ లాంగ్వేజ్ పరీక్షకు జనరల్ విద్యార్థులు 438 మందికిగాను 378 మంది, ఒకేషనల్ విద్యార్థులు 98 మందికిగాను 94 మంది హాజరైనట్లు తెలిపారు.

# అవగాహన లేకుంటే అనర్థం


ప్రత్తిపాడుకు చెందిన సురేష్, జానకి దంపతులకు పెళ్లయిన ఏడేళ్ల అనంతరం మగబిడ్డ జన్మించాడు. బిడ్డకు ఐదేళ్ల వయస్సు వచ్చినా లావు కావటం లేదని భావించిన సురేష్ దంపతులు వైద్యులను సంప్రదించారు. పరీక్షల అనంతరం బాలుడు థైరాయిడ్ వ్యాధికి గురైనట్లు వైద్యులు చెప్పటంతో ఖంగుతిన్నారు. లేకలేక పుట్టిన బిడ్డకు ఈ వ్యాధి ఎలా వచ్చిందో అర్థంగాక తలలు పట్టుకున్నారు.

పొన్నూరుకు చెందిన గాయత్రికి రెండేళ్ల కిందట పెళ్లయ్యింది. అనంతరం గర్భం ధరించటంతో బరువు పెరగసాగింది. కడుపులో బిడ్డ ఉండటం వల్ల, బిడ్డ కోసం అధికంగా పోషకాహారం తీసుకోవటం వల్ల బరువు పెరిగి ఉండవచ్చని భావించిన తల్లిదండ్రులు కొన్ని సమయంలో గుంటూరులోని సూపర్ స్పెషాలిటీ వైద్యులను సంప్రదించగా థైరాయిడ్ వ్యాధికి గురైనట్లు రిపోర్టు రావటంతో గాబరా పడ్డారు.

ఇలా ప్రతి రోజూ ఎంతో మంది వైద్యం కోసం వస్తున్నారని థైరాయిడ్ గ్రంథిపై చాలా మందికి సరైన అవగాహన లేకపోవటంతో వ్యాధిని నియంత్రణలో పెట్టుకోలేక అవస్థలు పడుతున్నట్లు ఎండ్రోక్రైనాలజిస్టులు తెలిపారు. శనివారం వరల్డ్ థైరాయిడ్ డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

**నేడు వరల్డ్ థైరాయిడ్ డే**

- థైరాయిడ్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి
- ప్రతి ఏడాది పెరుగుతున్న థైరాయిడ్ బాధితులు
- అప్పుడే పుట్టిన బిడ్డకు వ్యాధి సోకుతోంది




వరల్డ్ థైరాయిడ్స్ డే పోస్టర్

గుంటూరు మెడికల్: గొంతు ముందు భాగంలో శ్వాస నాళానికి ఇరుపక్కలా గులాబీ రంగులో ఇంచుమించు సీతాకోక చిలుక ఆకారంలో ఉండే గ్రంథిని థైరాయిడ్ గ్రంథి అంటారు .థైరాయిడ్ గ్రంథి మెదడులోని పిట్యూటరీ గ్రంథి స్రవించే థైరాయిడ్ స్టిమ్యూలేటింగ్ హార్మోన్(టి.ఎస్.హెచ్)ద్వారా టి3, టి4 అనే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. టి4 అనగా థైరాక్సిన్. ఇది 20గ్రాముల బరువు ఉండి శరీరంలోని చాలా జీవక్రియలను నియంత్రిస్తుంది. శరీర పెరుగుదలను, ఎముకల పెరుగుదలను, శరీరపు ఉష్ణోగ్రతను, మానసిక వికాసాన్ని అదుపుచేస్తుంది. వివిధ కణజాలాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ హార్మోను ఉత్పత్తికి మన శరీరంలో తగినంత అయోడిన్ అవసరం. రోజుకి 150 మైక్రోగ్రాముల (గుండుసూది తలంత) అయోడిన్ శరీరానికి అవసరం. థైరాక్సిన్‌లో 65శాతం అయోడిన్ ఉంటుంది. అయోడిన్ పెరుగుదలకు, శక్తి రావటానికి తోడ్పడుతుంది.

**థైరాయిడ్ లోపం వల్ల..**

ఈ వ్యాధి లక్షణాలు ఒక్కసారిగా కాక నిదానంగా కనబడతాయి. ఈ వ్యాధి వచ్చిన వారిలో ఉత్సాహం తగ్గి, అంతకు ముందులేని మందకొడితనం చోటు చేసుకుంటుంది. విపరీతమైన అలసట, నడవాలన్నా, పనిచేయాలన్నా ఓపిక ఉండదు. చర్మంలో తడి, నునుపు తనం తగ్గి, ఎండిపోయినట్లు ఉంటుంది. కండరాలు ఉబ్బుతాయి. దాని వల్ల ఒళ్లు ఉబ్బుగా కనిపిస్తుంది. ఒళ్లు ఉబ్బరం వల్ల ఉబ్బుకామెర్లుగా భ్రమపడే అవకాశం ఉంది. మలబద్ధకం, సెక్స్ సామర్థ్యం తగ్గిపోవడం, కండరాలు పట్టివేసినట్లు ఉండటం, చర్మం క్రింద కొవ్వు చేరి బరువు పెరుగుతారు. గొంతు బొంగురుగా మారటం, ముఖం గుండ్రంగా కనపడటం, మనిషి మందమతిగా మారతాడు. జీవక్రియ రేటు విపరీతంగా పెరిగి శరీరంలోని అన్ని శక్తి వనరులు ఖాళీ అవుతాయి. ఎముకల్లో క్యాల్షియం తక్కువై ఎముకలు పెలుసు బారతాయి. తలమీద వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి. ముఖ్యంగా కనుబొమ్మల వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి. పిల్లలో పెరుగుదల ఉండదు. పిచ్చితనం వస్తుంది. లావు అవ్వటం, బరువుపెరగటం, మత్తు, నిద్ర, ఒళ్లు నొప్పులు, మలబద్ధకం, స్త్రీలలో రుతుచక్రంలో మార్పులు రావటం, గర్భం రావటం ఆలస్యం అవ్వటం, తరచుగా గర్భస్రావాలు జరగటం తదితర లక్షణాలు ఉంటాయి.

**వ్యాధి నిర్ధారణ**

రక్తంలో టి3, టి4 టీఎస్‌హెచ్ అనే హార్మోన్లు ఎంత ఉన్నాయో పరీక్షలు చేస్తారు. దీన్నే థైరాయిడ్ ప్రొఫైల్ అంటారు.

#### మందులతో కట్టడి చేయవచ్చు



ఈ వ్యాధి అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని 90 ఏళ్ల వయస్సు వారికి వస్తుంది. మేనరిక వివాహాల వల్ల వ్యాధి రావచ్చు. మగవారి కన్నా ఆడవారిలో ఎక్కువగా థైరాయిడ్ గ్రంథి సమస్య వస్తోంది. ఆడవారిలో 80శాతం మందికి ఉంటే మగవారిలో 20శాతం మందికి వస్తుంది. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేయిస్తే పూర్తిగా నయమవుతోంది. ఒక్కొక్కరిలో ఒక్కొవిధంగా వ్యాధి లక్షణాలు ఉంటాయి. ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవటం వల్ల కొంత వరకు థైరాయిడ్ బారినపడకుండా కాపాడుకోవచ్చు. జన్యుపరలోపాల వల్ల, తల్లికి ఉంటే బిడ్డకు, వంశ పారంపర్యంగా వ్యాధి వస్తుంది. అప్పుడే పుట్టిన బిడ్డకు థైరాయిడ్ ఉందో లేదో నిర్ధారణ పరీక్ష చేయించటం చాలా ఉత్తమం.

– డాక్టర్ కె.సుబ్బారావు, ఎండ్రోకెనాలజిస్ట్, గుంటూరు.

### 500 మందిపై బైండోవర్ కేసులు

క్రోసూరు ఎస్ఐ ఎం.షఫీ

క్రోసూరు: ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న ఘర్షణల సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్ అమలు జరుగుతున్న ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. ఇప్పటికే 500 మందికిపైగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలు, కార్డన్ సెర్చ్‌లు, వాహనాల తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గురుకుల పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం



ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్

రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర)లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5వ తరగతికి 40 సీట్లు కేటాయించడం జరిగిందని ఈ ఖాళీలను రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీ-32, ఎస్సీ-5, బీసీ-2, ఓసీ-1 కేటాయించారన్నారు. అర్హులైన విద్యార్థులు జూన్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను స్థానిక పాఠశాలలో అందజేయాలని కోరారు. దరఖాస్తులతో పాటు విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జిరాక్స్‌లు, రేషన్ కార్డు నకలు, తల్లి బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్ జతచేసి పాఠశాలలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 15వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి రోస్టర్ విధానంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 8333925177లో సంప్రదించాలన్నారు.

## దాడి కేసులో పది మంది అరెస్ట్

నరసరావుపేట టౌన్: కారు అద్దాలు ధ్వంసం చేయటంతో పాటు డ్రైవర్‌పై దాడి చేసిన కేసులో పది మందిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ భాస్కర్ శుక్రవారం తెలిపారు. ఎన్నికల పోలింగ్ నాడు మున్సిపల్ బాలుర పాఠశాల ఎదుట నిలిపి ఉన్న కారును దుండగులు ధ్వంసం చేశారు. అడ్డుకున్న కారు డ్రైవర్ మక్కెన అంకమ్మరావుపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం పట్టణానికి చెందిన వై. ఈశ్వరరెడ్డి, జహిరుద్దీన్, గణేష్, షేక్ సుభానితో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించటంతో నిందితులను రాజమండ్రి సెంటర్ జైలుకు తరలించారు.

## పురోహితుడి ఇంట్లో చోరీ


దుండగులు పగులగొట్టిన బీరువా

దాచేపల్లి: ఇంటి యజమాని అయిన పురోహితుడు లేని సమయం చూసుకుని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి రూ. 8 లక్షలు విలువ చేసే బంగారు నగలు, రూ.45 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇంటి యజమాని చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. మండల పరిధిలోని కేసానుపల్లి గ్రామానికి చెందిన పానుగుపాటి ఆంజనేయశర్మ పురోహితుడిగా పనిచేస్తున్నాడు. గుంటూరులో ఉంటున్న బంధువులు చనిపోవడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మంగళవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా వెళ్లారు. బుధవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటికి వేసిన తాళం, బీరువా పగులగొట్టి బంగారు నగలు, నగదు చోరీ చేసినట్లుగా పురోహితుడు ఆంజనేయ శర్మ గుర్తించారు. తన ఇంట్లో చోరీ జరిగినట్లుగా గుర్తించిన ఆంజనేయశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎ.సురేంద్రబాబు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

## నాగరాజు కాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

బాపట్లటౌన్: మండలంలోని కొండుబొట్లవారిపాలెం సమీపంలోని నాగరాజు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. రూరల్ సీఐ శ్రీహరి వివరాల మేరకు.. సుమారు 60 సంవత్సరాలు వయస్సు కలిగిన వృద్ధురాలి మృతదేహం నాగరాజు కాలువలో కొట్టుకురావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేబీపాలెం వీఆర్వో ఫిర్యాదు మేరకు సీఐ శ్రీహరి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.





## డెంగీ నివారణ చర్యల పరిశీలన

**డ్రైడేపై ఎన్‌వీబీడీసీపీ సభ్యుల సూచన**


డీఎంహెచ్‌వో డాక్టర్ రవితో సమావేశమైన ఎన్‌వీబీడీసీపీ టీం సభ్యులు

నరసరావుపేట: జిల్లాలో డెంగీ నివారణ కోసం నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమ (నేషనల్ వెక్టర్ బర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం –ఎన్‌వీబీడీసీపీ) టీం సభ్యులు పరిశీలించారు. శుక్రవారం పల్నాడు రోడ్డులోని జిల్లా మలేరియా కార్యాలయాన్ని సందర్శించి అన్నీ మలేరియా యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించి డెంగ్యూ నివారణపై తీసుకుంటున్న చర్యలపై వారిని విచారించారు. టీఎం సభ్యులు పార్వతీశం, విజయరాజు, సుబ్రమణ్యంలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్‌లతో సమావేశమయ్యారు. డెంగ్యూ నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో విచారించారని డాక్టర్ రవీంద్ర రత్నాకర్ వెల్లడించారు. సెంటినల్ సర్వైలెన్స్ హాస్పిటల్‌లోని జిల్లా మలేరియా ల్యాబ్‌ను సందర్శించి రక్తపూతల సేకరణ, నమూనా సేకరణ, పరీక్ష విధానాల గురించి తగిన సూచనలు చేశారన్నారు. ప్రతీ గృహంలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటే దోమలు గుడ్లుపెట్టి ఏడు నుంచి పది రోజుల్లో దోమలుగా మారి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, పైలేరియా, మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ఆశ, ఏఎన్ఎం, సూపర్‌వైజర్లు ద్వారా ఫ్రైడే డ్రైడేను పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. పట్టణంలోని ఇస్లాంపేటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సందర్శించి వీక్షించారు. ముప్పాళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. సబ్ యూనిట్ అధికారి కె.శ్రీనివాసరావు, ఏఎంవో చుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 10 మంది నిందితులకు బెయిల్

రెంటచింతల: మండలంలోని రెండు గ్రామాల్లో ఈ నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనలో 10 మంది నిందితులకు శుక్రవారం నరసరావుపేట పీడీఎం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 20న ఎస్ఐ ఎం.ఆంజనేయులు నిందితులను అరెస్ట్ చేశారు. తుమ్మకోట గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో టీడీపీకి చెందిన పోట్ల సతీష్, జంగాల కోటేశ్వరరావు, మిద్దెపోగు మహేష్, జంగాల సైదులు, జెట్టిపాలెం గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి వైఎస్సార్ సీపీకి చెందిన కుందురు నర్సింహా రెడ్డి, మేకపోతుల శివారెడ్డి, కేతావత్ మంగ్లా నాయక్, కొండా రామయ్య, తిక్కా శ్రీనివాసరావు, పేర్ల శివరామ్‌లను నర్సరావుపేట పీడీఎం కోర్టులో హాజరు పెట్టగా వారిని రిమాండ్‌కు పంపించడం జరిగింది.

## పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. రైలు నంబరు 17228 (గుంటూరు - డోన్), రైలు నంబరు 17329 (హుబ్లీ–విజయవాడ), రైలు నంబరు 07791 (కాచిగూడా - నడికుడి), 07792 (నడికుడి - కాచిగూడా)లను జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. రైలు నంబరు 17227 (డోన్ - గుంటూరు) జూన్ 1 నుంచి జులై 1వ తేదీ వరకు, 17330 (విజయవాడ - హుబ్లీ) రైలు జూన్ 2 నుంచి జులై 1వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 17282 (నర్సాపూర్ - గుంటూరు) జూన్ 1నుంచి 30వ తేదీ వరకు విజయవాడ - గుంటూరు మధ్య తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 17281 (గుంటూరు - నర్సాపూర్) జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు గుంటూరు - విజయవాడ మీదుగా తాత్కాలికంగా రద్దు చేశామని, ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

## జారిపడి వృద్ధురాలి మృతి

బల్లికురవ: ఆలయంలో నిద్ర చేసేందుకు కుమార్తె, అల్లుడితో వచ్చిన వృద్ధురాలు మెట్లు దిగుతూ కిందపడి మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని గొర్రెపాడు గ్రామంలోని అంకాలమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన మందలపు మంగమ్మ (77)కు కుమార్తె జాష్టి పుష్పాలు, కుమారుడు అర్జున్‌రావు ఉన్నారు. కుమార్తె మానసిక స్థితి సరిగా లేనందున అల్లుడు అంజయ్యతో కలిసి నాలుగు రోజుల క్రితం గొర్రెపాడు గ్రామంలోని ఆలయానికి వచ్చారు. ఆలయంలో పూజలు చేయించుకుంటూ అక్కడే ఉన్న సత్రంలో నిద్రిస్తున్నారు. సత్రం మేడపైన బట్టలు ఆరవేసి తీసుకువచ్చేందుకు వెళ్లగా మంగమ్మ కాలుజారి మెట్లపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. శుక్రవారం ఘటనా స్థలాన్ని సంతమాగులూరు సీఐ కె.నరసింహారావు, బల్లికురవ పోలీసులు పరిశీలించారు. కుమారుడు అర్జున్‌రావు ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్ రైటర్ ఆంజనేయులు కేసు నమోదుతో పోస్టు మార్టం నిమిత్తం మంగమ్మ భౌతిక కాయాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# జంగాలపల్లిలో పోలీసుల తనిఖీలు


జంగాలపల్లిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు


వెంగళ్ళరెడ్డి నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణ


కేసానుపల్లి కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వినుకొండ (నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల అనంతరం పలు గ్రామాల్లో జరిగిన అల్లర్లకు పోలీసులు చెక్ పెట్టేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నూజెండ్ల మండలం జంగాలపల్లి గ్రామంలో శుక్రవారం ఐనవోలు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలో మారణాయుధాలు, నాటుబాంబులు ఏమైనా ఉన్నాయోమో అని సోదాలు నిర్వహించారు. అదే విధంగా సరైన పత్రాలు లేని బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో ఎస్ఐ లక్ష్మీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ముఖ్యంగా యువత ఇటువంటి రాజకీయ అల్లర్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఓటును వినియోగించుకోవడం పౌరుడి ప్రాథమిక హక్కు అయితే రాజకీయ అల్లర్లకు దూరంగా ఉండటం నైతిక హక్కుగా ప్రతిఒక్కరూ భావించాలని తెలిపారు.

**సత్తెనపల్లిలో....**

సత్తెనపల్లి: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని వెంగళ్ళరెడ్డి నగర్‌లో పట్టణ పోలీసులు శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గృహాల్లో విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పర్చుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు ఆస్కారం ఉంటుందనే సూచనలు నేపథ్యంలో ఈ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు పట్టణ ఎస్ఐ ఎం. సత్యనా రాయణ, పోలీసులు, మహిళా పోలీసులు, ఉన్నారు.

**శాంతిభద్రతలు కాపాడేందుకు సహకరించాలి**

దాచేపల్లి: శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. సమస్యాత్మక గ్రామమైన కేసానుపల్లిలో శుక్రవారం కార్డెన్ సర్చ్‌ని నిర్వహించారు. గ్రామంలో అనుమానాస్పదంగా గుర్తించిన ప్రతి ఇంటిలో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసిన తరువాత గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాల్లో రెచ్చగొట్టేలా మాట్లాడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎ. సురేంద్రబాబు, ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి ఉన్నారు.

# ప్రాణాంతకం..హెల్మెట్ రహిత ప్రయాణం

- రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ద్విచక్ర వాహనదారులు
- అందులో అధిక శాతం హెల్మెట్ లేని ప్రయాణాలే కారణం
- చిన్నపాటి రక్షణ చర్యలతో తప్పుతున్న ప్రాణాపాయం
- వాహనదారుల్లో స్వీయ చైతన్యం అవసరమంటున్న అధికారులు

ఇటీవల బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పోలూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు తాళ్లూరి వినోద్ కుమార్ బైకు అదుపు తప్పి కింద పడిపోయారు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. అలాగే నగరం మండలం ఉల్లిపాలేనికి చెందిన ఓ యువకుడు పేటేరు నుంచి వెళ్తూ ఓలేరు సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించి పోయి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో హెల్మెట్ ధరించి ఉంటే చిన్నపాటి గాయాలతో బయటపడేవాడని పోలీసులు తెలిపారు. ఇటువంటి ఘటనలు జిల్లాలో అనేకం చోటుచేసుకుంటున్నాయి.




రేపల్లె పట్టణంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నలుగురు యువకులు

రేపల్లె రూరల్: హెల్మెట్ రహిత ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యం వీడడం లేదు. అతివేగం, అజాగ్రత్త కారణాలుగా తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో హెల్మెట్ లేక పోవడంతో తలకు బలమైన గాయాలయ్యి.. ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులు బాధితులుగా కుమిలిపోతున్నారు.

**చిన్నపాటి జాగ్రత్తలతో సురక్షితంగా గమ్యానికి..**

చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించడంతో పాటు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరవచ్చునని పోలీసు అధికారులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలపై దూర ప్రాంతాలకు వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేస్తున్నారు. కారులో ప్రయాణించే వారు డ్రైవర్‌తో పాటు సీట్ బెల్ట్ ధరించాలని చెబుతున్నారు.

**ప్రమాదాల నివారణకు కఠినంగా వ్యవహరించాలి..**

రహదారి ప్రమాదాలను నివారించడానికి పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. నిరంతరం ప్రధాన కూడళ్లలో రహదారులపై తనిఖీలు నిర్వహించి, మైనర్లు వాహనాలు స్వాధీనం చేసుకుని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటూ అపరాధ రుసుం విధించాలని సూచిస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు ప్రమాదాల తీవ్రతను వివరించాలంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో రహదారులపై మైనర్ బాలురు ద్విచక్ర వాహనలపై ముగ్గురు నుంచి నలుగురు వరకు ఎక్కి ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అతి వేగంగా వాహనాలు నడపడం ప్రమాదాలకు మరో కారణంగా ఉంటోంది.

**పోలీసుల తనిఖీల్లో రాజకీయ జోక్యం తగదు..**

ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకునే చర్యలకు రాజకీయ నాయకుల జోక్యం అడ్డుపడకూడదని ప్రజా సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. పోలీసుల తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ లేకుండా పట్టుబడిన వారిని వదిలేయాలంటూ రాజకీయ నాయకులు కలుగజేసుకోవడం మానుకోవాలని హితవు పలుకుతున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం**

రహదారి ప్రమాదాలను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఏటా జనవరి 11 నుంచి 17వ తేదీ వరకు రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహన చోదకులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన సూచనలిస్తూ.. హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తున్నాం. పరిమితికి మించి ప్రయాణికులతో నడిపే ఆటో డ్రైవర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

– ప్రసన్నకుమారి, ఎంవీఐ, బాపట్ల.

# రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని వేజండ్ల మణిపురం (మిక్స్ కేబిన్) వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి వేజండ్ల-మణిపురం రైల్వే స్టేషన్ మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరసర ప్రాంతాల్లో దర్యాప్తు చేశారు. వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రి మార్చురీకీ తరలించారు. మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంగ్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెల్సిన వారు 7207076614, 0863–2220753 నంబర్లకు సమాచారం తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

# ప్రతి గురువారం ఉచితంగా టీబీ వ్యాక్సిన్

గుంటూరు మెడికల్: జిల్లాలో ప్రతి గురువారం పెద్దలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్ వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఏపీలో కేస్ స్టడీ కింద పలు జిల్లాలు ఎంపిక చేశారని, వాటిలో గుంటూరు జిల్లా ఒకటని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో టీబీ వ్యాక్సిన్ వేయించుకునేందుకు సమ్మతి తెలియజేస్తూ పత్రాలు ఇచ్చిన వారు 1.77 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వాక్సిన్ ప్రక్రియ మే నుంచి జూలై వరకు కొనసాగుతోందని, సమ్మతి తెలియజేసిన వారందరూ తప్పకుండా వేయించుకోవాలని ఆమె కోరారు.

**వ్యాక్సిన్‌కు అర్హులు**

60 సంవత్సరాలు పైబడిన వారు, 18 నుంచి 60 సంవత్సరాలలోపు పొగ తాగేవారు, 18 నుంచి 60 సంవత్సరాల లోపు మధుమేహ వ్యాధిగ్రస్తులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారు, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు, 2018 నుంచి టీబీ బారినపడి చికిత్స పొందుతున్న వారు, 2021సంవత్సరం జనవరి 1 నుంచి టీబీ వ్యాధిగ్రస్తులతో కాంటాక్ట్ లో ఉన్నవారు వ్యాక్సిన్ వేయించుకునేందుకు అర్హులని ఆమె తెలిపారు.

**వీరికి వ్యాక్సిన్ అవసరం లేదు**

18 సంవత్సరాల లోపలి వారు, గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, క్యాన్సర్ పేషెంట్లు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, మూడు నెలల లోపల రక్త మార్పిడి చేయించుకున్న వారు, వ్యాక్సిన్ చేయించుకోవడానికి నిరాకరించిన వారు, బీసీజీ, ఇతర వ్యాక్సిన్లకు గతంలో తీవ్ర రియాక్షన్ వచ్చినవారికి అవసరం లేదని డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు.



తెనాలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కె.భూషణం డీజిల్‌ను ఆదా చేయడంలో జిల్లాలోనే ముందు వరుసలో ఉన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం డిపో ఆవరణలో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఆయనకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ బీఎస్-6 బస్సులకు సంబంధించి లీటర్‌కు భూషణం అత్యధిక కేఎంపీఎల్-6.03 సాధించారని చెప్పారు. ఇదే విధంగా అందరూ డ్రైవర్లు ఆయిల్ ఆదా చేసే విధంగా డ్రైవింగ్ చేయాలని ఆయన సూచించారు. – తెనాలి అర్బన్

# వైభవంగా శ్రీకాకుళేశ్వరస్వామి రథోత్సవం



శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని శ్రీ రాజ్యలక్ష్మి, భోగలక్ష్మీ సమేత శ్రీకాకుళేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో గురువారం రాత్రి రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రాజ్యలక్ష్మి, భోగలక్ష్మీ సమేత శ్రీకాకుళేశ్వరస్వామివార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించగా ఆలయ ఏసీ చక్రధరరావు, చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్‌లు కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి ఎస్ఐలు కె.ప్రతాప్ రెడ్డి, చినబాబు, సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.